## ● చెక్‌పోస్టు వద్ద నిఘా



కరంజిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో జిల్లా పోలీసు యంత్రాంగం చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. భీంపూర్ మండల సరిహద్దు కరంజి(టీ), తలమడుగు మండలం లక్ష్మీపూర్ వద్ద చెక్‌పోస్టులతో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. తెలంగాణ నుంచి మద్యం, డబ్బు లాంటివి రవాణా కాకుండా నిఘా ఉంచారు.

- తాంసి, నవంబర్ 3

## ఆవు, దూడను అందజేసిన సీఐ

తలమడుగు, నవంబర్ 3 : పల్లి(బీ) గ్రామానికి చెందిన రేణుక ఇటీవల బాబుకు జన్మనిచ్చి అనారోగ్యంతో మృతి చెందింది. ఆ బాబు పాల కోసం అవస్థలు పడుతుండడంతో కొందరు వ్యక్తులతో ఈ విషయాన్ని తెలుసుకొని ఇచ్చోడ మండల సమీపంలోని జై శ్రీరామ్ గోశాలకు వెళ్లగా సీఐ భీమేశ్ చేతుల మీదుగా బాబు తండ్రి మారుతికి ఆవు, దూడను అందజేశారు. కార్యక్రమంలో గోశాల నిర్వాహకులు ఐదా రాజేశ్ పాల్గొన్నారు.

## 6న జాబ్‌మేళా

ఎదులాపురం, నవంబర్ 3 : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 6వ తేదీన ఉదయం 11 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కే మిల్కా ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మేడ్చల్ కేఎల్ గ్రూప్ కంపెనీలో వేర్‌హౌజ్ అసోసియేట్, సెక్యూరిటీ సూపర్‌వైజర్, రిసెప్షనిస్ట్ ఉద్యోగాలకు సంబంధించి పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న జిల్లాలోని నిరుద్యోగ యువత అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సెల్ నంబర్ 9440586437ను సంప్రదించాలని సూచించారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

ఉట్నూర్, నవంబర్ 3 : శాంతినగర్ కాలనీకి చెందిన సెడ్మాకి రాజు ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పరామర్శించారు. రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఉద్యోగ విరమణ సహజం

ఉట్నూర్, నవంబర్ 3 : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, విరమణ సహజమని ఎంపీ నగేశ్ అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఈఈగా పని చేసిన రాథోడ్ భీంరావ్ ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన సభను ఆదివారం ఉట్నూర్‌లోని పెర్కాగూడ జేసీబీ గార్డెన్‌లో నిర్వహించారు. ఈఈ రాథోడ్ భీంరావ్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలవత్, జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎమ్మెల్యే రేఖనాయక్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, ఆత్రం సుగుణ, మాజీ జడ్పీటీసీ రాథోడ్ చారులత పాల్గొన్నారు.

## నక్షత్ర నవగ్రహ పూజలో పాల్గొన్న ఎంపీ

తాంసి, నవంబర్ 3 : ఆయుషా ఫంక్షన్ హాల్లో తాంసి మాజీ జడ్పీటీసీ తాటిపల్లి రాజు ఆదివారం నిర్వహించిన వాస్తు నక్షత్ర నవగ్రహ పూజ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నక్షత్ర నవగ్రహ హోమం కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు సదానందం, మండల నాయకులు దేవేందర్, అరుణ్‌కుమార్, నారాయణ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ఉట్నూర్, నవంబర్ 3 : ప్రజ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఫోన్ ఇన్ కాల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు, రోడ్లు, నీటి, మురుగు కాలువలు, ఫారెస్టు, పింఛన్ సమస్యలపై ఫోన్ కాల్స్ వచ్చాయని తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి నేరుగా ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

## అబుల్ కలాం ఆజాద్ జయంతి

సారంగాపూర్, నవంబర్ 3 : మండల కేంద్రంతో పాటు స్వర్ణ గ్రామాల్లో కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం దేశ తొలి విద్యా శాఖ మంత్రి, భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ సొసైటీ జిల్లా వ్యవస్థాపకుడు మహ్మద్ ఉస్మాన్, సారంగాపూర్ మండలాధ్యక్షుడు నాయి ముద్దీన్, నాయకులు వీరయ్య, నర్సారెడ్డి, మహేశ్ రెడ్డి, సొసైటీ సభ్యులు జమీర్, మసూద్, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు బిన్ అలీ, ప్రధానకార్యదర్శులు షేక్ ఇంత్యాజ్, షేక్ షాదుల్లా హుస్సేన్ పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లు ప్రారంభం

భైంసా, నవంబర్ 3: భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఆదివారం పత్తి కొనుగోళ్లను యజమానులు ప్రారంభించారు. క్వింటాల్ పత్తికి రూ. 7121 ధరను చెల్లిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే బంగారు భవిష్యత్

ఎదులాపురం, నవంబర్ 3 : విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన రెడ్డి కులస్తులకు ఆదివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో న్యూ హౌజింగ్ బోర్డులోని సంఘ భవనంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కొలువులు సాధించిన వారిని సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్ల నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపిడి రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శి రాజారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కిష్టారెడ్డి, దేవేందర్ రెడ్డి, నాగారెడ్డి, భూమారెడ్డి పాల్గొన్నారు.


కుంటాల పీహెచ్‌సీలో ఒకే గదిలో ఓపీ, ల్యాబ్ పరీక్షలు, ఫార్మసీ సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది


పీహెచ్‌సీ ప్రసూతి విభాగం భవనం

# ఒకే గదిలో అన్ని సేవలు

● ఇబ్బందులు పడుతున్న వైద్య సిబ్బంది, రోగులు

కుంటాల, నవంబర్ 3 : నిర్మల్ జిల్లా కుంటాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరిసర ప్రాంత గ్రామాల నుంచి రోజుకు 90 మందికి పైగా రోగులు వస్తుంటారు. పీహెచ్‌సీ భవనానికి అదనంగా రూర్బన్ నిధులు రూ. 40 లక్షలతో పోస్ట్ ఆపరేటివ్ వార్డు రోగుల అటెండర్ విశ్రాంతి భవనాలను నిర్మించారు. పాత పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో రూ.19 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. సమయానికి కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకపోవడంతో ఇంకా అదనపు భవనంలోని ఒక గదిలోనే ఓపీ, ల్యాబ్ పరీక్షలు ఫార్మసీ సేవలు నిర్వహించాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. దీంతో సిబ్బందికి, రోగులకు అసౌకర్యంగా ఉంటోంది. ఈ గదుల్లో కూడా టైల్స్ ఉండడం, వర్షపు నీరు లీక్ అయి షార్ట్ సర్క్యూట్ కావడం లాంటి ఘటనలు జరిగాయని సిబ్బంది వాపోయారు. ప్రసూతి సేవలు నిర్వహించడం ఆటంకంగా మారుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దవాఖానకు అన్ని సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు కాకపోవడం కాంగ్రెస్ వైఫల్యం


గెజిట్ పత్రాలు చూపిస్తున్న నాయకులు

బోథ్, నవంబర్ 3 : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సొనాలను మండలంగా ఏర్పాటు చేశామని, అయినా మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు కాకపోవడం కాంగ్రెస్ నాయకుల వైఫల్యమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం సొనాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గెజిట్ విడుదలై సంవత్సరం దాటినా కాంగ్రెస్ నాయకులు కార్యాలయాలు రాకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ నుంచి మండల గెజిట్ పత్రాలను తెప్పించి నూతన కార్యాలయాల కోసం హైకోర్టులో కేసు ఫైల్ చేయడం జరిగిందన్నారు. ఎవరు పని చేస్తున్నారో, ఎవరు కాలయాపన చేస్తున్నారో ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. కోర్టు ఆర్డర్ వచ్చిన తర్వాత ఎన్నికలు నూతన మండల పరిధిలోనే జరుగనున్నాయని సమాచారం ఉందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కెనాల్ ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు


లక్ష్మీపూర్ కెనాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

జైనథ్, నవంబర్ 3 : సాత్నాల లక్ష్మీపూర్ రిజర్వాయర్ కెనాల్ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని సాత్నాల ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్ అన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు అందజేసిన వినతిపత్రంపై స్పందించిన డీఈ ఆదివారం లక్ష్మీపూర్ రిజర్వాయర్‌ను సందర్శించారు. కెనాల్‌లో పూడికతీత, తదితర సమస్యలను రైతులను, నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ సాత్నాల ప్రాజెక్టు కుడి కాల్వ, రిజర్వాయర్ ద్వారా రైతులకు 20 వేల ఎకరాలను సాగు నీరు అందిస్తున్నామన్నారు. పూడికతీత, కెనాల్ నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకొని చివరి ఆయకట్టు రైతుల పంట పొలాలకు సాగు నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, సాత్నాల ఏఈ భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

## కథల పోటీల్లో లక్ష్మీపూర్ విద్యార్థిని ప్రతిభ

జైనథ్, నవంబర్ 3 : మాచిరాజు బాల సాహిత్య పీఠం నిర్వహించిన బడి పిల్లల కథల పోటీ- 2024లో జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని తల్లెల కీర్తి ప్రతిభ కనబరిచింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో తల్లెల కీర్తిని తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ మృణాళిని సన్మానించారని ప్రధానోపాధ్యాయులు అశోక్ తెలిపారు. కీర్తి రాసిన 'తెలుగు లోనే' కథకు బహుమతి రావడం జరిగింది. విద్యార్థికి ప్రశంసాపత్రం, జ్ఞాపికతో పాటు, నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిని గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ బాల సాహిత్య వేత్తలు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు డాక్టర్ పాత్తిపాక మోహన్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ కన్నెగంటి అనసూయ, ఆకాశవాణి విశ్రాంత డైరెక్టర్ నాగసూరి వేణుగోపాల్, మాచిరాజు బాల సాహిత్య పీఠం చైర్మన్ కామేశ్వరరావ్ పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న విద్యార్థిని తల్లెల కీర్తి

# సమాజ ఉన్నతికి కృషి చేయాలి


జాదవ్ చంద్రశేఖర్‌ను శాలువాతో సన్మానిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్, నవంబర్ 3 : బంజారా సమాజ ఉన్నతికి కృషి చేయాలని జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఉట్నూర్‌లోని తన స్వగృహంలో అఖిల భారతీయ బంజారా సేవా సంఘ్ నార్నూర్ మండలాధ్యక్షుడు జాదవ్ చంద్రశేఖర్‌ను ఆదివారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభ్యున్నతికి హర్నిశలు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అఖిల భారతీయ బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్‌రెడ్డి నాయక్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ రమేశ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

## సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి


గుస్సాడీ దండారీకి చెక్కు అందజేస్తున్న కేస్లాపూర్ మాజీ సర్పంచ్ మెస్రం నాగ్‌నాథ్

ఇంద్రవెల్లి, నవంబర్ 3 : ఆదివాసీ గిరిజనులు సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని కేస్లాపూర్ మాజీ సర్పంచ్ మెస్రం నాగ్‌నాథ్ అన్నారు. ఆదివారం కేస్లాపూర్ గ్రామంలోని గుస్సాడీ దండారీకి రూ.15 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ మెస్రం వెంకట్‌రావ్ పటేల్, మెస్రం బాదిరావ్ పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు


సాయినాథ్‌ను కాపాడిన పోలీసులు

భైంసా, నవంబర్ 3 : ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు కాపాడిన ఘటన ఆదివారం వేకువజామున భైంసాలో చోటు చేసుకుంది. వివరాలకు వెళ్లితే.. కుభీర్ మండలం నిగ్వా గ్రామానికి చెందిన సాయినాథ్ భైంసాలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో స్థానికులు 100కు డయల్ చేశారని, స్పందించిన బ్లూ కోర్టు సిబ్బంది రమేశ్ గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వెళ్లి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన సాయినాథ్‌ను కాపాడి దవాఖానలో చేర్పించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. తక్షణమే స్పందించి నిండు ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్ రమేశ్‌ను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

## అయ్యప్ప సేవా సమితి కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

భైంసా, నవంబర్ 3 : ఏపీనగర్, శాస్త్రినగర్, శివాజీ నగర్, గోపాల్ నగర్, సంతోష్ నగర్‌కు చెందిన అయ్యప్ప మాలధారణ భక్తులు ఆదివారం గోపాల్ నగర్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో కాలనీ అయ్యప్ప సేవా సమితి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆశమోల్ల మోహన్, ఉపాధ్యక్షులుగా మెంచు శివాజీ, కార్యదర్శిగా దేశెట్టి వెంకటేశ్, కోశాధికారిగా సాయిబాబా, గౌరవ సలహా సభ్యులుగా సాయినాథ్, సాయిప్రసాద్, రాములును ఎన్నుకున్నారు. కాలనీకి చెందిన అయ్యప్ప మాలధారణ భక్తులు నరేశ్, రాజేశ్, నరేందర్, విశాల్, తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య


జయశ్రీ(ఫైల్)

పెంబి, నవంబర్ 3 : పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన పెంబి మండలం ఇటిక్యాల గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటిక్యాల గ్రామానికి చెందిన సీమల లింగన్న-సోమవ్వ దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. చిన్న కూతురు సీమల జయశ్రీ (17) ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. చదువుకోవాలని ఆసక్తి ఉన్నప్పటికీ అనారోగ్యంతో బాధపడుతూ చదువు మానేసింది. తోటి స్నేహితులు చదువుకుంటుండడంతో తాను చదువుకోవడంలేదని మనస్తాపానికి గురై శనివారం ఇంటి వద్ద ఉన్న పురుగుల మందు తీసుకొని తమ పంట చేనుకు వెళ్లి తాగింది. పక్కనే ఉన్న పంట చేనులోని వారి కుటుంబ సభ్యులు గమనించి నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## చెరువులో మునిగి ఒకరు మృతి

కుంటాల, నవంబర్ 3 : మతిస్థిమితం లేని వ్యక్తి చెరువులో మునిగి మృతి చెందిన ఘటన కుంటాల మండలం లింబా(కే) గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ భాస్కరాచారి తెలిపిన వివరాల ప్రకారం.. లింబా(కే) గ్రామానికి చెందిన చందుల్వార్ గంగాధర్ (33) దీపావళి పూజలో పాల్గొన్న అనంతరం కనబడకుండా వెళ్లిపోయాడు. గతంలో అప్పుడప్పుడు మతిస్థిమితం సరిగా లేక ఇంటి నుంచి బయటకు వెళ్లి మూడు, నాలుగు రోజులకు తిరిగి వస్తుండేవాడు. అదే రాత్రి నుంచి కుటుంబ సభ్యులు వెతికినా దొరకలేదు. గత సంవత్సరం నుంచి అతిగా మద్యం తాగుతూ ఉండేవాడు. అదే క్రమంలో ప్రమాదవశాత్తు ఊరు చివరన చెరువులో పడి మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## మాజీమంత్రిని కలిసిన నాయకులు


మాజీమంత్రి జోగు రామన్నకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న నాయకులు

ఖానాపూర్, నవంబర్ 3 : ఖానాపూర్ మున్నూరు కాపు సంఘం నాయకులు ఆదివారం ఆదిలాబాద్‌లో మాజీమంత్రి జోగు రామన్నను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 10వ తేదీన పట్టణంలో ఏర్పాటు చేసిన రైతు విగ్రహ ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రం అందజేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. ఇక్కడ నాయకులు బీసీ రాజన్న, ఆకుల శ్రీనివాస్, సిరిపురం నాగరాజు, రాజన్న, లక్ష్మణ్, కొక్కుల ప్రదీప్ తదితరులు ఉన్నారు.

## బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఖానాపూర్, నవంబర్ 3: ఖానాపూర్ పద్మావతి నగర్ కాలనీలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం శాలువాతో సన్మానించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న తెలిపారు. ఇక్కడ ఆలయ కమిటీ సభ్యులు నిమ్మర రమేశ్, లక్ష్మణ్, రాములు, సుధాకర్, సత్యం, భీమన్న, సురేశ్ ఉన్నారు.

## తెలంగాణ గణిత ఫోరం జిల్లా కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

నిర్మల్ అర్బన్, నవంబర్ 3 : నిర్మల్‌లో ఆదివారం తెలంగాణ గణిత ఫోరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా చట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మనోహర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా రమాదేవి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త నర్సయ్య, ప్రవీణ్, విశ్రాంత పీజీహెచ్ఎం నరేందర్‌రెడ్డి హాజరయ్యారు.

## నేడు పింఛన్‌దారుల సమావేశం

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 3 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు పింఛన్‌దారులకు పింఛన్ పెంచుతామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేకపోవడం పట్ల నిర్మల్ టీఎన్జీవోస్ భవనంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ దివ్యాంగుల పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సట్టి సాయన్న తెలిపారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వితంతువులు, వృద్ధులకు రూ. 4 వేలు పెంచి ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. ఈ సమావేశానికి వీహెచ్‌పీఎస్ జాతీయ నాయకురాలు సుజాత సూర్యవంశీ రానున్నందున పింఛన్‌దారులు పాల్గొనాలని ఆయన కోరారు.

## నేడు మీ-సేవ కేంద్రాలు బంద్

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 3 : నిర్మల్ జిల్లాలో సోమవారం మీ-సేవ కేంద్రాలను తాత్కాలికంగా బంద్ చేస్తున్నట్లు మీ-సేవ ఉపాధ్యక్షుడు మెరుగు పవన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో మీ-సేవ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా అందరూ వేడుకల్లో పాల్గొంటున్నందున బంద్ పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం యథావిధిగా మీ-సేవ కేంద్రాలు కొనసాగుతాయని తెలిపారు.

## గుండెపోటుతో యువ నాయకుడు మృతి

నర్సాపూర్(జీ), నవంబర్ 3 : రాంపూర్ అనుబంధ గ్రామం నసీరాబాద్‌కు చెందిన నల్లోల ఆనంద్ (36) అనే యువ నాయకుడు శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. గతంలో ఆనంద్ నిర్మల్ బీజేపీ అసెంబ్లీ ఐటీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పని చేశాడు. కాంగ్రెస్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా పని చేస్తూ అందరి మన్ననలను పొందాడు. ఆదివారం జరిగిన అంత్యక్రియలకు నిర్మల్ మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తి హాజరయ్యారు. ఆనంద్‌కు భార్య నవీన, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న వయసులో మరణించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

## తప్పిన పెను ప్రమాదం

తాంసి(భీంపూర్), నవంబర్ 3: భీంపూర్ మండలం అంతర్గాంలో రైతు కునారపు రాకేశ్ ఇంట్లో 100 క్వింటాళ్ల వరకు పత్తి నిల్వ ఉంది. ఈ క్రమంలో ఆదివారం వలస కూలీ కుటుంబ చిన్నారి పటాకులు కాల్చగా నిప్పు రవ్వలు పత్తి వైపు వెళ్లి క్రమంగా అగ్ని జ్వాలాలు లేచాయి. అప్రమత్తమైన రైతు కుటుంబం, గ్రామస్తులు వెంటనే మంటలు ఆర్పారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.


## పెంచిన కాస్మోటిక్, డైట్ చార్జీలపై అవగాహన

ఎదులాపురం, నవంబర్ 3: వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన కాస్మోటిక్, డైట్ చార్జీలు పెంచడం జరిగిందని హాస్టల్ వార్డెన్ లింగంపల్లి దత్తు తెలిపారు. ఆదివారం వసతి గృహంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు పెరిగిన చార్జీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హాస్టల్ వార్డెన్ లింగంపల్లి దత్తు

# ఉద్యోగులకు సన్మానం

ఎదులాపురం, నవంబర్ 3: ఇటీవల ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు, నర్సింగ్, కానిస్టేబుళ్లను మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ మాట్లాడుతూ నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన వారందరూ పేదలకు సేవ చేసి తల్లిదండ్రులకు, సంఘానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షుడు మేకల మల్లన్న, ఆర్థిక కార్యదర్శి గంపల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు ఏరా సుధీర్, సంయుక్త కార్యదర్శి ముల్కల రాజేశ్వర్, నాయకులు బేర దేవన్న, సూరం భగవాన్, దాసరి బాబన్న, మొట్టె కిరణ్, రాళ్లబండి శంకర్, గడుగు నరేందర్, రాఘువేంద్ర, ముచ్చ రఘు, వెంకటస్వామి, పొచ్చన్న, ప్రకాశ్, రాజు, అశోక్, జగదీశ్, అర్జున్ పాల్గొన్నారు.


ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు